సాక్షి కర్నూలు

గురువారం ၊ 16 ၊ ఫిబ్రవరి ၊ 2023



0.9 టీఎంసీల నీటి నిల్వ

గూడూరు: సుంకేసుల రిజర్వాయర్‌లో బుధవారం సాయంత్రం సమయానికి 0.954 టీఎంసీల నీరు నిల్వ ఉంది. కేసీ కెనాల్‌కు 1,255 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.



పేదరికాన్ని తరిమికొడదాం

పేదరికాన్ని తరిమికొట్టేందుకు కృషి చేయాలని ప్లానింగ్ సెక్రటరీ విజయ్‌కుమార్ అన్నారు. ఉమ్మడి కర్నూలు జిల్లా అధికారులతో బుధవారం ఆయన సమీక్ష నిర్వహించారు. 8లో▸



టీబీ డ్యాం సమాచారం

పూర్తి మట్టం	:1,633 అడుగులు
ప్రస్తుతం	:1,611.21
టీఎంసీల సామర్థ్యం	:105,788
ప్రస్తుతం	:40,011
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	:000
ఔట్‌ఫ్లో (క్యూసెక్కులు)	:8,146

న్యూస్‌రీల్

నేటి నుంచి 'స్థానిక' ఎమ్మెల్సీ నామినేషన్లు

కర్నూలు(సెంట్రల్): జిల్లాలో స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికకు గురువారం ఉదయం నోటిఫికేషన్ విడుదల కానుంది. ఆ వెంటనే నామినేషన్ల స్వీకరణకు అధికారులు చర్యలు తీసుకుంటారు. ఫిబ్రవరి 23వ తేదీ వరకు నామినేషన్లను దాఖలు చేయవచ్చు. స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల రిటర్నింగ్ అధికారిగా కర్నూలు జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.రామసుందర్‌రెడ్డి నియమితులయ్యారు. ఈ క్రమంలో ఆయన కార్యాలయంలోనే సెలవుల్లో కాకుండా సాధారణ రోజుల్లో ఉదయం 11 నంచి మధ్యాహ్నం 3 గంట వరకు నామినేషన్లు స్వీకరించనున్నారు. నామినేషన్ దాఖలు చేసే వ్యక్తి 30 ఏళ్లు, ఆపైన వయసును కలిగి, రాష్ట్రంలోని ఏదైనా అసెంబ్లీ నియోజకవర్గంలో ఓటరై ఉండాలి. స్థానికసంస్థల ఎన్నికల్లో ఓట్లు వేసే వారిలో కనీసం 10 మంది పత్రాలపై సంతకాలు చేయాల్సి ఉంటుంది. ఎస్సీ, ఎస్టీలు అయితే రూ.5 వేలు, బీసీలు, ఇతరులు రూ.10 వేలు చలానా లేదంటే నగదు రూపంలో చెల్లించాల్సి ఉంటుంది.

అనంతపురంలో..

పశ్చిమ రాయలసీమ పట్టభద్ర, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థులు అనంతపురంలో నామినేషన్లను దాఖలు చేయాల్సి ఉంది. ఆ రెండు ఎన్నికల ఆర్‌ఓగా అనంతపురం కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి ఉండడంతో ఆమె కార్యాలయంలోనే నామినేషన్లను స్వీకరిస్తారు.

రేపు 'దేవదాయశాఖ ఈఓ' మెయిన్స్ పరీక్ష

కర్నూలు(సెంట్రల్): దేవదాయ శాఖలో ఖాళీగా ఉన్న ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్(గ్రేడు-3) పోస్టుల భర్తీ కోసం శుక్రవారం మెయిన్స్ పరీక్ష నిర్వహించనున్నారు. కర్నూలు శివారులోని కేవీ సుబ్బారెడ్డి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో ఉదయం, మధ్యాహ్నం వేళల్లో పరీక్ష నిర్వహిస్తారు. ఉదయం 9.30-12 గంటల వరకు 183 మంది, మధ్యాహ్నం 2.30-5గంటల వరకు 183 మంది పరీక్షకు హాజరుకానున్నట్లు ఏపీపీఎస్సీ జిల్లా కో ఆర్డినేటర్, డీఆర్వో ఎస్వీ నాగేశ్వరరావు తెలిపారు.

కార్మికులకు 'ఈ-శ్రామ్' తప్పనిసరి

కర్నూలు(రాజ్‌విహార్): ప్రతి అసంఘటిత కార్మికుడు ఈ-శ్రామ్ గుర్తింపు కార్డును తప్పనిసరిగా కలిగి ఉండాలని కార్మిక శాఖ కర్నూలు సహాయ అధికారి కేశన్న బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ-శ్రామ్‌తో ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయని పేర్కొన్నారు. సమీపంలోని సచివాలయాల్లో దరఖాస్తు చేసుకొని, గుర్తింపు కార్డులు పొందవచ్చని సూచించారు.

ఇంటర్ విద్యార్థులకు నైతిక విలువల పరీక్ష



పరీక్షలను పరిశీలిస్తున్న ఆర్ఐఓ వెంకట గురవయ్య శెట్టి

కర్నూలు(సిటీ): ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం చదువుతున్న విద్యార్థులకు నైతిక, మానవ విలువల పరీక్ష బుధవారం నిర్వహించారు. జిల్లాలోని అన్ని యాజమాన్యాలకు చెందిన జూనియర్ కాలేజీల్లో ఈ పరీక్షను నిర్వహించారు. ఉమ్మడి జిల్లాలోని 306 కాలేజీల్లో నిర్వహించిన పరీక్షలకు జనరల్ విభాగం నుంచి 30,892 మంది విద్యార్థులకు గాను 30,360 మంది విద్యార్థులు హాజరయ్యారు. ఒకేషనల్ విభాగంలో 2,880 మంది విద్యార్థులకు గాను 2,752 మంది హాజరయ్యారు. ఈ పరీక్షలో 60 మార్కులు థియరీకి, 40 మార్కులు ప్రాజెక్టు వర్క్‌కు కేటాయించారు. పరీక్ష నిర్వహించిన కాలేజీలోనే మూల్యాంకనం చేసి మార్కులు వేయాలని బోర్డు అధికారులు సూచించారు. నగరంలోని పరీక్షలను ఇంటర్మీడియట్ బోర్డు ప్రాంతీయ కార్యాలయ అధికారి వెంకట గురవయ్య శెట్టి పరిశీలించారు. రేపు (శుక్రవారం) పర్యావరణ విద్య పరీక్ష జరగనుంది.

పంట నమోదుతో బహుళ ప్రయోజనం

సి.బెళగల్: పంట నమోదుతో బహుళ ప్రయోజనాలు ఉన్నాయని రాష్ట్ర వ్యవసాయ శాఖ సహాయక సంచాలకులు (డీడీ) వెంకటేశ్వర్లు అన్నారు. కర్నూలు జేడీఏ కార్యాలయ ఏడీఏ బాలవర్ధిరాజుతో కలిసి బుధవారం ఆయన సి.బెళగల్ మండలంలోని గ్రామాల్లో పర్యటించారు. ఈ పంటలో నమోదైన పంటలకు పంటల బీమాతో పాటు నష్టపరిహారం అందుతుందన్నారు.



పంట నమోదును పరిశీలిస్తున్న వెంకటేశ్వర్లు



ఎమ్మెల్సీ పోరు.. ప్రచార జోరు

ఎమ్మెల్సీ ఎన్నికలకు నేడు నోటిఫికేషన్

- గ్రాడ్యుయేట్, ఉపాధ్యాయ, స్థానిక సంస్థల ఎమ్మెల్సీలతో ఎన్నికల వేడి
- ప్రతిష్టాత్మకంగా తీసుకోవాలని వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యేలకు సీఎం దిశానిర్దేశం
- మండలానికి 10 మంది, పట్టణాల్లో వంద మందికి ఒకరు చొప్పున బాధ్యుల నియామకం
- నామినేషన్‌కు సిద్ధమైన అభ్యర్థులు
- ఓటర్లను ప్రసన్నం చేసుకునేందుకు విస్తృత ప్రచారం
- స్థానిక సంస్థల కోటాలో ఖరారు కాని అభ్యర్థులు

'సీమ'లో ఎమ్మెల్సీ ఎన్నికల కోలాహలం మొదలైంది. గ్రాడ్యుయేట్, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ బరిలోని అభ్యర్థులు ఓటర్లను ప్రసన్నం చేసుకునేందుకు ఆరు జిల్లాల్లో పర్యటనలు చేస్తుంటే, స్థానిక సంస్థల కోటాలో బరిలోకి దిగేందుకు ఆశావహులు అభ్యర్థిత్వాలను ఖరారు చేసుకునే పనిలో నిమగ్నమయ్యారు. దీంతో జిల్లాలో ఎన్నికల వాతావరణం వేడెక్కింది. గెలుపే లక్ష్యంగా వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యేలకు ఆ పార్టీ అధినేత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దిశానిర్దేశం చేస్తే, మరోవైపు జిల్లాలో టీడీపీ ఉనికే లేకపోవడం, ఎన్నికల ముందు కాస్తయినా పార్టీకి, అభ్యర్థికి కొత్త ఊపు తెస్తుందనుకున్న లోకేశ్ పాదయాత్ర అట్టర్‌ఫ్లాప్ కావడంతో ఆ పార్టీ శ్రేణుల్లో నైరాశ్యం నెలకొంది.

– సాక్షి ప్రతినిధి కర్నూలు



కర్నూలులో ఇటీవల తనకు మొదటి ప్రాధ్యానత ఓటు వేసి గెలిపించాలని అభ్యర్థిస్తున్న వైఎస్సార్‌సీపీ రాయలసీమ పశ్చిమ పట్టభద్రుల నియోజకవర్గం అభ్యర్థి వెన్నపూస రవీంద్రారెడ్డి. చిత్రంలో ఎమ్మెల్యేలు, పార్టీ నేతలు

ఎమ్మెల్సీ ఎన్నికల సమరం కీలక దశకు చేరుకుంది. ఎన్నికల కమిషన్ నేడు నోటిఫికేషన్ విడుదల చేయనుంది. ఈ మేరకు నేటి నుంచి రాయలసీమ పశ్చిమ గ్రాడ్యుయేట్, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానాలకు అభ్యర్థులు నామినేషన్ దాఖలు చేయనున్నారు. అయితే 'స్థానిక సంస్థల' అభ్యర్థులను రాజకీయ పార్టీలు ఇంకా ఖరారు చేయాల్సి ఉంది. ఇదిలాఉంటే ఎమ్మెల్సీ ఎన్నికలపై ఈ నెల 13న ఎమ్మెల్యేలతో నిర్వహించిన సమావేశంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దిశానిర్దేశం చేశారు. దీంతో కర్నూలు, నంద్యాల జిల్లాలోని 14మంది ఎమ్మెల్యేలు ఎన్నికల వ్యవహారంలో నిమగ్నమయ్యారు. మండలానికి 10 మంది బాధ్యులను ఏర్పాటు చేశారు. ఈ పదిమంది ఓటర్లను కలిసి మద్దతు కూడగట్టనున్నారు. పట్టణప్రాంతాల్లో ప్రతి వందమంది ఓటర్లకు ఒక బాధ్యుడు ఉండేలా బాధ్యతలు అప్పగించారు. ఇలా ఎవరికివారు పని విభజన చేసుకుని ఆ పార్టీ అభ్యర్థి వెన్నపూస రవీంద్రారెడ్డి గెలుపునకు కృషి చేస్తున్నారు. అలాగే మండల, గ్రామస్థాయిల్లో కూడా మండలాధ్యక్షులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ, జెడ్పీటీసీలు కూడా మార్చి 23న పోలింగ్ జరిగే వరకూ ఎన్నికల హడావుడిలోనే ఉండనున్నారు. క్షేత్రస్థాయి నుంచి పార్టీ కేడర్ పనిచేసేలా ప్రణాళిక రచించారు. ఎమ్మెల్సీ ఎన్నికల తర్వాత కేవలం 14 నెలల్లోనే సార్వత్రిక ఎన్నికలు ఉండనున్న నేపథ్యంలో ఈ ఎన్నికలను వైఎస్సార్‌సీపీ ప్రతిష్టాత్మకంగా తీసుకుంది.

ఓటు హక్కు ఎలా అంటే..

- డిగ్రీ పూర్తి చేసి, ఓటు దరఖాస్తు చేసుకుని జాబితాలో పేరున్న గ్రాడ్యుయేట్లు పట్టభద్రుల కోటా ఓటరుగా అర్హులు.
- డిగ్రీ పూర్తి చేయకుండా డీఎడ్ ద్వారా ఉద్యోగం తెచ్చుకున్న ఎస్జీటీ(సెకండరీ గ్రేడ్ టీచర్లు)లకు ఉపాధ్యాయ, గ్రాడ్యుయేట్ ఎన్నికల్లో ఓటు హక్కు ఉండదు.
- స్కూల్ అసిస్టెంట్లకు రెండు ఓట్లు ఉంటాయి. అయితే టీచర్‌గా ఉద్యోగం పొంది కనీసం మూడేళ్లు పూర్తయి ఉండాలి.
- మూడేళ్ల అనుభవం ఉన్న ప్రైవేటు పాఠశాల ఉపాధ్యాయులు కూడా డీఈఓ, ఎంఈఈ ఆథరైజేషన్‌తో ఓటు హక్కుకు దరఖాస్తు చేసుకున్నారు.
- పట్టభద్రుల కోటాలో 3,28,807, ఉపాధ్యాయుల ఓట్లు 27,716 ఉన్నాయి.
- ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో రామచంద్రారెడ్డి చురుగ్గా ప్రచారం చేస్తున్నారు.

లోకేశ్ పాదయాత్ర ప్రభావం కూడా తీవ్రంగానే..

టీడీపీకి లోకేశ్ పాదయాత్ర కొత్త ఉత్సాహాన్ని తీసుకొస్తుందని, ఇది పార్టీతో పాటు ఎమ్మెల్సీ ఎన్నికల్లో తమకు మేలు చేస్తుందనే భావనలో టీడీపీ నేతలు ఉన్నారు. అయితే పాదయాత్ర అట్టర్‌ఫ్లాప్ కావడంతో పూర్తిగా ఢీలాపడ్డారు. 'యువగళం' పేరుతో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమంలో మందీమార్బలం మినహా వందమంది కూడా వెంట నడవని పరిస్థితి. ఈ ప్రభావం ఎమ్మెల్సీ ఎన్నికలపైనా చూపుతోంది. ప్రధానంగా ఎమ్మెల్సీ ఎన్నికల్లో కీలకమైన యువత ఆ పార్టీ పట్ల పెద్దగా ఆసక్తి చూపకపోవడం టీడీపీ ఓటమిని ముందే ఖరారు చేస్తోంది.

స్థానిక సంస్థల కోటా ఏకగ్రీవమేనా?

కర్నూలు జిల్లాలో స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికకు నేడు నోటిఫికేషన్ వెలువడనుంది. అయితే జిల్లాలో ఎంపీటీసీ, జెడ్పీటీసీలతో పాటు కార్పొరేటర్లు, కౌన్సిలర్లలో 90శాతంపైగా వైఎస్సార్‌సీపీ అభ్యర్థులే. కాబట్టి ఈ ఎన్నికల్లో టీడీపీ లేదా ఇతర పార్టీలు పోటీ చేసే పరిస్థితి దాదాపు ఉండకపోవచ్చు. వైఎస్సార్‌సీపీ అభ్యర్థిని ప్రకటిస్తే ఈ ఎన్నిక ఏకగ్రీవం అయ్యే అవకాశాలే ఎక్కువ. ఒకవేళ టీడీపీ అభ్యర్థిని ప్రకటించినా పోటీ నామమాత్రమే.

అభ్యర్థుల ప్రచారం ముమ్మరం

గ్రాడ్యుయేట్, టీచర్ ఎమ్మెల్సీ ఎన్నికల బరిలోని అభ్యర్థులు ప్రచారాన్ని ముమ్మరం చేశారు. ఆరు జిల్లాల్లోని సచివాలయాల ఉద్యోగులు, ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాల్లోని టీచర్లు, ఇతర ప్రభుత్వ శాఖల్లోని ఉద్యోగులను కలుస్తున్నారు. అలాగే మార్నింగ్‌వాక్ ట్రాక్‌లలో కూడా అభ్యర్థులు ఓట్లు అభ్యర్థిస్తున్నారు. వైఎస్సార్‌కాంగ్రెస్‌పార్టీ అభ్యర్థి వెన్నపూస రవీంద్రారెడ్డి గతేడాది జులై నుంచి ఎమ్మెల్సీ ఎన్నికల వ్యవహారంలో బిజీగా ఉన్నారు. ఆయన తండ్రి సిట్టింగ్ ఎమ్మెల్సీ వెన్నపూస గోపాల్‌రెడ్డి ఎన్నికకు పనిచేసిన అనుభవం ఉండటంతో ఓటు నమోదు ప్రక్రియ నుంచి పలు అసోసియేషన్లు, ఉద్యోగులు, రాజకీయ, ప్రజాసంఘాలను కలుస్తూ మద్దతు కూడగడుతున్నారు. ఎన్నికల బరిలోని మరో ప్రధాన పార్టీ టీడీపీ ఈ విషయంలో పూర్తిగా వెనుకబడింది. భూమిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి ఎవ్వరికీ తెలియని పేరు. పైగా టీడీపీ పోటీలో వద్దని చాలామంది ఆపార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్‌లు మొదట చెప్పారు. గత ఎమ్మెల్సీ ఎన్నికల్లో టీడీపీ అధికారంలోకి ఉండి, కేజే రెడ్డి గెలకపోలేకపోయాడని, ఇప్పుడు కనీసం పోటీ కూడా ఇచ్చే పరిస్థితి ఉండదని అధినేతతో చెప్పినట్లు తెలుస్తోంది. అయితే పోటీలో లేకపోతే ప్రజల్లో పార్టీపై మరింత చులకనభావం ఏర్పడుతుందని చంద్రబాబు రాంగోపాల్‌రెడ్డిని పోటీ నిలిపినట్లు ప్రచారం ఉంది.

ఇతని తరపున టీడీపీ నేతలు కూడా ఎవ్వరూ గట్టిగా పనిచేయకపోవడం గమనార్హం. ఇకపోతే అనంతపురానికి చెందిన బీసీ నాగరాజు, పట్టుపోగుల పవన్‌కుమార్‌లు వారిస్థాయిలో ప్రచారం సాగిస్తున్నారు.



సామూహిక వివాహాలు జరుగుతున్న దృశ్యం, హాజరైన బంధువులు

గ్రామస్తులే పెళ్లి పెద్దలుగా..

- హెబ్బటంలో సామూహిక వివాహాలు
- వధూవరులను ఆశీర్వదించిన మంత్రి గుమ్మనూరు జయరాం



నూతన వధూవరులను ఆశీర్వదిస్తున్న మంత్రి గుమ్మనూరు జయరాం

హొళగుంద: వారంతా పేదలు.. రెక్కల కష్టంపై బతికేవారు.. ఘనంగా పెళ్లి చేసుకునే స్థోమత లేదు.. వీరికి గ్రామస్తులు అండగా నిలిచారు. స్వచ్ఛందంగా చందాలు వేసుకున్నారు. శివదీక్ష స్వాములు సైతం ఆర్థిక సహకారం అందించారు. గ్రామస్తులే పెళ్లి పెద్దలుగా వ్యవహరించి బుధవారం అంగరంగ వైభవంగా సామూహిక వివాహాలు జరిపించారు. హొళగుంద మండలం హెబ్బటం గ్రామంలో జరిగిన ఈ బృహత్తర కార్యక్రమానికి రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం, దేవరగట్టు ఆలయ చైర్మన్ గుమ్మనూరు శ్రీనివాసులు హాజరయ్యారు. ఒక్కటైన ఐదు నూతన జంటలను ఆశీర్వదించి, కానుకలు సమర్పించారు. సామూహిక వివాహ కార్యక్రమం నిర్వహించిన గ్రామస్తులను మంత్రి అభినందించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ ఆలూరు నియోజకవర్గ ఇన్‌చార్జ్ కోట్ల సుజాతమ్మ, గ్రామ పెద్దలు అయ్యాళప్ప, ఆనందగిరి, ఎంపీటీసీ సభ్యుడు ఉరుకుందప్ప తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమానికి హాజరైన వారికి, పెళ్లి కుమారులు, పెళ్లి కూతుళ్ల తరపున వచ్చిన బంధువులకు భోజన, విడిది సౌకర్యాలను గ్రామస్తులే కల్పించారు.

ఇల కైలాసం.. భక్తి పారవశ్యం

- రావణ వాహనంపై విహరించిన స్వామి అమ్మవార్లు
- పులకించిన భక్తజనం
- రాష్ట్ర ప్రభుత్వం తరఫున పట్టువస్త్రాలు సమర్పించిన మంత్రి బుగ్గన



రావణ వాహనంపై ఆలయ ప్రదక్షిణ చేస్తున్న భ్రమరాంబా సమేత మల్లికార్జున స్వామి

శ్రీశైలంటెంపుల్: శివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం శ్రీశైలంలో రావణవాహన సేవ నిర్వహించారు. తెలుగు రాష్ట్రాల నుంచి భారీగా తరలివచ్చిన భక్తజనం ఉత్సవమూర్తులను దర్శించుకుని పులకించిపోయారు. ముందుగా దేవాలయ ప్రాంగణంలోని అలంకార మండపంలో సుగంధ పుష్పాలతో విశేషంగా అలంకరించిన రావణ వాహనంపై భ్రమరాంబా మల్లికార్జున స్వామి వార్ల ఉత్సవమూర్తులను అధిష్ఠింపజేశారు. ప్రధాన అర్చకులు, పండితులు వేదమంత్రోచ్చారణలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూజా కార్యక్రమంలో రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి, శ్రీశైల దేవస్థానం ధర్మకర్తల మండలి చైర్మన్ రెడ్డివారి చక్రపాణిరెడ్డి, ఈఓ ఎస్.లవన్న పాల్గొన్నారు. రావణవాహనాధీశులైన స్వామిఅమ్మవార్లకు ఆలయ ఉత్సవం నిర్వహించి, పరివార దేవాలయాల్లో ప్రత్యేక పూజా కార్యక్రమాల అనంతరం గ్రామోత్సవానికి తరలించారు. గంగాధర మండపం వద్ద ప్రత్యేక హారతులనిచ్చి అక్కడి నుంచి నంది మండపం, బయలు వీరభద్రస్వామి దేవాలయం వరకు ఊరేగించారు. గ్రామోత్సవంలో సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.



పట్టు వస్త్రాలకు పూజలు చేస్తున్న మంత్రి బుగ్గన

నేడు పుష్పపల్లకీ సేవ

బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆరో రోజు గురువారం సాయంత్రం మల్లికార్జున స్వామికి పుష్పపల్లకీ సేవ, అనంతరం గ్రామోత్సవం నిర్వహిస్తారు.

రాష్ట్ర ప్రభుత్వం తరపున పట్టువస్త్రాలు

సంప్రదాయాన్ని అనుసరించి రాష్ట్ర ప్రభుత్వం తరపున బుధవారం శ్రీభ్రమరాంబా మల్లికార్జున స్వామి అమ్మవార్లకు రాష్ట్ర ఆర్థికశాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి పట్టువస్త్రాలు సమర్పించారు. ఆలయ చైర్మన్, ఈఓ, అధికారులు స్వాగతం పలికారు.

17 నుంచి భారీ వాహనాలు నిషేధం

ఆత్మకూరు: శ్రీశైలంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా ట్రాఫిక్ అంతరాయం తలెత్తకుండా ముందస్తు చర్యల్లో భాగంగా ఈనెల 17 నుంచి 19 తేదీ వరకు కర్నూలు-దోర్నాల ప్రధాన రహదారిలో భారీ వాహనాలను నిషేధిస్తున్నట్లు ఎస్ఐ కృష్ణమూర్తి బుధవారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ కర్నూలు పట్టణం నుంచి దోర్నాల- విజయవాడ వైపు వెళ్లే భారీ వాహనాలన్నీ నంద్యాల, గిద్దలూరు, మార్కాపురం మీదుగా విజయవాడ చేరుకోవాలని సూచించారు. అలాగే ఆత్మకూరు నుంచి దోర్నాల-విజయవాడకు వెళ్లే లారీలు, ఆత్మకూరు పట్టణంలోని నంద్యాల టర్నింగ్ నుంచి వెలుగోడు, బండిఆత్మకూరు, నంద్యాల మీదుగా గిద్దలూరు, మార్కాపురం మీదుగా విజయవాడ వెళ్లాలని కోరారు. దోర్నాల నుంచి కర్నూలు వచ్చే వాహనాలు గిద్దలూరు మీదుగా నంద్యాల, కర్నూలు వెళ్లాలని చెప్పారు.

'అగ్ని యాప్'తో ఎన్‌ఓసీ సేవలు

- అగ్నిమాపక శాఖ ప్రాంతీయ అధికారి భూపాల్‌రెడ్డి



కర్నూలు: వ్యాపార సంస్థలు, ఆసుపత్రుల నిర్వాహకులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా అగ్ని యాప్ ద్వారా ఎన్‌ఓసీ(నో అబ్జెక్షన్ సర్టిఫికెట్)లు జారీ చేయనున్నట్లు అగ్నిమాపక శాఖ రాయలసీమ ఫోర్త్‌జోన్ ప్రాంతీయ అధికారిగా ఎం.భూపాల్‌రెడ్డి తెలిపారు. బుధవారం కర్నూలులో ఆయన బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ కర్నూలు, నంద్యాల, వైఎస్సార్, అన్నమయ్య, అనంతపురం, సత్యసాయి, చిత్తూరు జిల్లాల్లో అగ్నిమాపక సేవలు పర్యవేక్షిస్తూ మెరుగైన సేవలు అందిస్తామన్నారు. అగ్ని ప్రమాదాలపై ప్రజల్లో చైతన్యం తెచ్చేందుకు అవగాహన కార్యక్రమాలు విస్తృతం చేస్తామన్నారు. పెనుగొండ, విజయనగరం, రాజమండ్రిలో ప్రాంతీయ శిక్షణ కేంద్రాలు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా అగ్నిమాపక శాఖలో పనిచేసే 270 మంది సిబ్బందికి ఈత రాదని, రాజమండ్రిలో ఈనెల 20 తర్వాత వారందరికీ విపత్తు సహాయక చర్యలతో పాటు (ఈతతో పాటు) అడ్వాన్స్ కోర్సులపై శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. డీఎఫ్‌ఓలు అవినాష్, జయసింహా, జయన్న, శ్రీనివాసరెడ్డి, పెద్దిరెడ్డి, వివిధ ఫైర్ స్టేషన్ ఆఫీసర్లు, సిబ్బంది భూపాల్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలసి శుభాకాంక్షలు తెలిపారు.

పట్టాలెక్కని కొత్త రైల్వే ప్రాజెక్టులు!

- బడ్జెట్ కేటాయింపుల్లో వాటి ఊసే కరువు
- పెండింగ్ ప్రాజెక్టులకు అరకొర నిధులు
- అసంతృప్తి వ్యక్తం చేస్తున్న జిల్లా ప్రజలు



కర్నూలు సిటీ రైల్వే స్టేషన్

కర్నూలు(రాజ్‌విహార్): రైల్వే కేటాయింపుల్లో ఉమ్మడి కర్నూలు జిల్లాకు మరోసారి తీవ్ర అన్యాయం జరిగింది. కొత్త ప్రాజెక్టుల ఊసే లేకపోగా, పెండింగ్ ప్రాజెక్టులకు అరకొర నిధులు విదిల్చారు. 2023-24 ఆర్థిక సంవత్సరానికి సాధారణ బడ్జెట్‌ను ఈనెల 1వ తేదీన పార్లమెంటు సమావేశాల్లో కేంద్ర ఆర్థికశాఖ మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టారు. ఇందులో రైల్వే పద్దులను జోన్ల వారీగా ఖరారు చేయగా, బుధవారం దక్షిణ మధ్య రైల్వే అధికారులు నిధులు కేటాయిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. కర్నూలు, నంద్యాల జిల్లాల్లోని రైల్వే ప్రాజెక్టులకు సంబంధించి 25కు పైగా డిమాండ్లు ఉన్నాయి. వీటి పురోగతి కోసం రూ.2వేల కోట్లు కావాల్సి ఉంది. పెండింగ్ పనుల్లో ఏ ఒక్కదానికి పూర్తి స్థాయిలో నిధులు కేటాయించలేదు. దీంతో జిల్లా ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

- మంత్రాలయం – కర్నూలు మధ్య కొత్త రైల్వే లైను ఏర్పాటు చేయాలనే డిమాండ్ 52 ఏళ్ల నుంచి ప్రతిపాదనలో ఉంది. ఈ లైనుకు మూడు సార్లు సర్వే చేశారు. 2004, 2011, 2018లో రూటు ఖారారు చేశారు తప్ప మంజూరు చేయలేదు.
- నిరుద్యోగ సమస్యను తగ్గించేందుకు 2013లో తెరపైకి వచ్చిన ట్రైన్ మెయింటెన్స్ షెడ్ నామ రూపాలు లేకుండా పోయింది. దూపాడు వద్ద దీనిని ఏర్పాటు చేస్తామని గతంలో ప్రభుత్వం చెప్పింది. రూ.200 కోట్లతో నిర్మిస్తే 5 వేల మందికి ప్రత్యక్ష, పరోక్షంగా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభించే అవకాశాలు ఉన్నా ప్రస్తుతం ఈ ప్రాజెక్టు ఊసే కరువైంది.
- విజయవాడకు వెళ్లేందుకు కర్నూలు నుంచి రోజువారీ రెగ్యులర్ రైళ్లు లేవు. ప్రత్యేక చార్జీలతో నడుపుతున్న మచిలీపట్నం స్పెషల్ రైలును గత ఏడాది మంజూరు చేసినా ఇది వారంలో మూడు రోజులు మాత్రమే నడుస్తోంది. మిగితా రోజుల్లో డోన్, నంద్యాలకు వెళ్లి రైలెక్కాలి. కర్నూలు నుంచి ఒక ఇంటర్ సిటీ ఎక్స్‌ప్రెస్‌తో పాటు రెండు ప్యాసింజరు రైళ్లను రోజువారిగా నడపాల్సిన అవసరం ఉంది.
- కర్నూలు నుంచి కొత్త జిల్లా నంద్యాలకు నేరుగా వెళ్లేందుకు రైల్వే మార్గం లేదు. డోన్, బేతంచెర్ల మీదుగా రైళ్లు వెళ్తున్నాయి. దీంతో నంద్యాలకు రైలు ద్వారా వెళ్తే నాలుగున్న గంటల సమయం పడుతోంది. కొత్త లైను ఏర్పాటు చేస్తే రెండు జిల్లాలు అభివృద్ధి చెందుతాయి.

ఇవీ కేటాయింపులు..

- కర్నూలు సమీపంలో రైల్వే మిడ్ లైఫ్ రిహాబిలిటేషన్ వర్క్‌షాపు ఏర్పాటు చేసేందుకు 2013 బడ్జెట్‌లో ప్రతిపాదించారు. 100 ఎకరాల్లో స్థల సేకరణ చేసి, పనులు చేపట్టారు. నిధుల కొరత కారణంగా పదేళ్లయినా పనులు పూర్తి కాలేదు. అరకొరగా నిధులు కేటాయిస్తుండడంతో పనులు నత్తనడకన సాగుతున్నాయి. ప్రస్తుతం ఈ ప్రాజెక్టు పూర్తికి రూ.125 కోట్లు కేటాయించారు.
- నంద్యాల-యర్రగుంట్ల మధ్య విద్యుదీకరణ కోసం రూ.1.70 కోట్లు కేటాయించారు. 123 కిలో మీటర్ల పొడవైన ఈ ప్రాజెక్టు 2017-18లో మంజూరైంది.
- అకోలా నుంచి కర్నూలు మీదుగా డోన్ వరకు డబ్లింగ్ కోసం రూ.60 కోట్లు కేటాయించారు. 2019-20లో రూ.6,260 కోట్లతో ఈ ప్రాజెక్టు మంజూరైంది. గత ఏడాది కూడా కేవలం రూ.5 కోట్లే కేటాయించారు. ప్రస్తుతం కాచిగూడ - మహబూబ్ నగర్ మధ్య ఈ పనులు జరుగుతున్నాయి.
- మన్మాడ్ - ముద్ఖేడ్- డోన్ మధ్య విద్యుదీకరణ పనుల కోసం రూ.60 కోట్లు కేటాయించారు. 783 కిలో మీటర్ల ఈ ప్రాజెక్టు 2015-16లో రూ.865 కోట్లతో మంజూరైంది. కర్నూలు-గద్వాల మధ్య జరుగుతున్న ఈ పనులు మార్చి నెలాఖరులోగా పూర్తి చేసి ప్రారంభించనున్నారు.
- గుంటూరు నుంచి డోన్ మీదుగా గుంతకల్లు వరకు నిర్మిస్తున్న డబ్లింగ్ పనులకు రూ.980 కోట్లు కేటాయించారు. గుంటూరు-గుంతకల్లు డివిజన్ల మధ్య 401.47 కిలోమీటర్ల పొడవున్న ఈ ప్రాజెక్టు 2016-17లో రూ.3,631 కోట్ల వ్యయంతో మంజూరు చేశారు. ప్రస్తుతం డోన్-ఎద్దులదొడ్డి, నల్లపాడు-సాట్లూరు, కురిచేడు-గజ్జలకొండ మధ్య డబ్లింగ్, విద్యుదీకరణ పనులు పూర్తయ్యాయి. మిగిలిన చోట్ల పనులు సాగుతున్నాయి.
- డోన్ - భోగోలు మధ్య మల్కాపురం వద్ద రోడ్డు లెవెల్ క్రాసింగ్ వద్ద రోడ్ అండ్ బ్రిడ్జి (ఆర్‌ఓబీ) నిర్మాణానికి రూ.50 లక్షలు కేటాయించారు.

క్లుప్తంగా

నెక్లెస్ చోరీ నిందితుడు కారు డ్రైవరే



నిందితుడి అరెస్టు చూపుతున్న సీఐ సుబ్బరాయుడు

బనగానపల్లెరూరల్: పట్టణంలో ఈ నెల 12న కారులో నెక్లెస్ మాయమైన కేసులో డ్రైవరే నిందితుడని సీఐ సుబ్బరాయుడు, ఎస్ఐ రామిరెడ్డి తెలిపారు. బుధవారం స్థానిక పోలీస్ స్టేషన్ నెక్లెస్‌తో పాటు నిందితుడిని అరెస్ట్ చూపి కేసు వివరాలను విలేకరులకు వెల్లడించారు. వారు మాట్లాడుతూ కోవెలకుంట్ల పట్టణానికి చెందిన శివరామ కృష్ణయ్య తన భార్యతో కలిసి ఈ నెల 12వ తేదీన బనగానపల్లెలోని ధనలక్ష్మి ఫంక్షన్ హాల్‌లో జరిగిన ఓ వివాహనికి కారులో అత్తార్ ఉమర్ అనే డ్రైవర్‌తో వచ్చారు. వివాహనికి హాజరై తిరిగి స్వగ్రామం కారులో బయల్దేరారు. ఈ క్రమంలో ఆమె తన మెడలో ఉన్న నెక్లెస్ (సుమారు ఐదు తులాలు బరువు, రూ.2.50 లక్షల విలువ కలిగిన)ను తీసి కారు డాష్ బోర్డులో పెట్టింది. బనగానపల్లె కూరగాయల మార్కెట్ సమీపంలో కారు దిగి కూరగాయలు కొనేందుకు వెళ్లింది. తిరిగి వెళ్లే క్రమంలో డాష్ బోర్డులో పెట్టిన నెక్లెస్ కనిపించకపోవడంతో అక్కడే పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కాగా.. పోలీసులు అనుమానంతో డ్రైవర్‌ను తమదైన శైలిలో విచారించడంతో నిజం ఒప్పుకున్నాడు. కేసును రెండు రోజుల్లో ఛేదించిన ఎస్ఐ రామిరెడ్డి, సిబ్బంది సుబ్బరామ కృష్ణ, ప్రదీప్‌ను డోన్ డీఎస్పీ శ్రీనివాసరెడ్డి అభినందించినట్లు సీఐ చెప్పారు.

వృద్ధుడి అదృశ్యం



పెద్దయ్య (ఫైల్)

ఆస్పరి: మండల కేంద్రమైన ఆస్పరికి చెందిన వృద్ధుడు పెద్దయ్య అదృశ్యమయ్యారని, ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వరప్రసాద్ బుధవారం విలేకరులకు తెలిపారు. పెద్దయ్య వారం రోజులు నుంచి ఆస్పరిలో కనబడకపోవడవతో భార్య యల్లమ్మ ఫిర్యాదు చేశారన్నారు. ఆచూకీ కనిపిస్తే సెల్ నంబర్ 9121101159కు తెలపాలన్నారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతి



మద్దికెర: మండల పరిధిలోని ఎం.అగ్రహారం గ్రామ సమీపంలో రైలుపట్టాలపై గుర్తుతెలియని వ్యక్తి రైలు కింద పడి బుధవారం మృతి చెందాడు. మృతి చెందిన వ్యక్తికి దాదాపు 25 ఏళ్ల ఉంటాయి. బ్లూ కలర్ జీన్స్‌ప్యాంటు, బ్లాక్ కలర్ షర్ట్‌తో పాటు గోధుమ రంగు చలికోటు ధరించి ఉన్నాడు. ప్రమాదవశాత్తు మరణించాడా లేక ఆత్మహత్య చేసుకున్నాడా అనేది తెలియాల్సి ఉంది. రైల్వే పోలీసులు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నారు.

మల్లన్నా..మము బ్రోవవా..



నల్లమల అడవిలో భీమునికొలను దాటుతూ శ్రీశైలానికి కాలినడకన వెళ్తున్న భక్తులు

శ్రీశైలేశుడి బ్రహ్మోత్సవాలను తిలకించేందుకు వివిధ ప్రాంతాల నుంచి భక్తులు, మాలధారులు తరలివస్తున్నారు. కొందరు వెంకటాపురం నుంచి భీమునికొలను, కైలాస ద్వారం ద్వారా కాలినడకన శ్రీగిరి చేరుకుంటున్నారు. మరికొందరు వాహనాల్లో వస్తున్నారు. ముందుగా పాతాళగంగలో పుణ్యస్నానాలు ఆచరించి భ్రమరాంబ, మల్లికార్జున స్వామి వార్లను దర్శించుకొని పులకిస్తున్నారు. భక్తుల ఓం నమశ్శివాయ పంచాక్షరి జపంతో నల్లమల గిరులు ప్రతిధ్వనిస్తున్నాయి. – సాక్షి ఫొటోగ్రాఫర్



పాతాళగంగలో పుణ్యస్నానాలు



నడకదారిలో భూచక్రగడ్డ రుచి చూస్తూ..



శ్రీశైలంలో పుష్పశోభితమైన ధ్వజస్తంభం



పాతాళగంగ వద్దకు చేరుకునేందుకు టూరిజం వారు ఏర్పాటు చేసిన రోప్‌వే



పాతాళగంగలో జ్యోతిని వదులుతున్న మహిళ



భీమునికొలను - కైలాసద్వారం దారిలో శివ లింగానికి నమస్కరిస్తున్న భక్తులు



ఉత్సవమూర్తులకు ప్రత్యేక పూజలు నిర్వహించి నైవేద్యంగా పండ్లు, పుష్పాలు సమర్పించిన దృశ్యం



చంటిబిడ్డను భుజాలపై ఎత్తుకుని మల్లన్న దర్శనానికి వెళ్తున్న భక్తుడు

ఆరోగ్య కేంద్రంలో ఆపరేషన్ విజయవంతం



ఆపరేషన్ చేస్తున్న డాక్టర్ అభినవ్‌రెడ్డి

కోవెలకుంట్ల: స్థానిక కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో వరి బీజంతో బాధపడుతున్న ఓ వృద్ధుడికి బుధవారం నిర్వహించిన ఆపరేషన్ విజయవంతమైంది. సంజామల మండలం నొస్సం గ్రామానికి చెందిన శంకరయ్య కొన్ని నెలల నుంచి వరి బీజంతో బాధపడుతున్నాడు. చికిత్స నిమిత్తం ఆసుపత్రికి వచ్చిన రోగిని పరీక్షించిన డాక్టర్లు ఆపరేషన్ చేయించుకోవాలని సూచించారు. ప్రభుత్వం ఆసుపత్రిలో అన్ని వసతులు సమకూర్చడంతో ఇతర ఆసుపత్రులకు వెళ్లాల్సిన అవసరం లేకుండా డాక్టర్‌తో పాటు స్టాఫ్ నర్సులు ఇంద్రావతి, సంతోషి, ఆపరేషన్ థియేటర్ అసిస్టెంట్ బాషా ఆధ్వర్యంలో అక్కడే ఆపరేషన్ చేశారు. ఇటీవల కాలంలో సీహెచ్‌సీలో వివిధ రకాల ఆపరేషన్లు జరుగుతుండటంతో పేదలు ధీమా వ్యక్తం చేస్తున్నారు.

ఆర్మీ మాజీ ఉద్యోగి ఆత్మహత్య



మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

నంద్యాల(రూరల్): రైలు కింద పడి మాజీ జవాన్ ఆత్మహత్యకు పాల్పడ్డాడని రైల్వే ఎస్ఐ జలీల్ బుధవారం తెలిపారు. వివరాలు.. గుంటూరు జిల్లా చేబ్రోలు గ్రామానికి చెందిన గోరంట్ల కృష్ణమూర్తి (58) 12 సంవత్సరాల క్రితం ఆర్మీలో పదవీ విరమణ పొందాడు. ప్రస్తుతం కుటుంబానికి దూరంగా ఉంటూ నంద్యాల పరిసర ప్రాంతాల్లో ఒంటరిగా తిరుగుతుండేవాడు. మృతుడికి భార్య, పిల్లలు లేక పోవడంతో ఒంటరిగా ఉండటం ఇష్టం లేక జీవితంపై విరక్తి చెంది ఆత్మహత్య చేసుకొని ఉండొచ్చని మృతుడి బంధువులు తెలిపారన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి, కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వివరించారు.

పేదరికాన్ని తరిమికొడదాం

స్పందన అర్జీలను ప్రాధాన్యతగా పరిష్కరించాలి

- సుస్థిరాభివృద్ధి లక్ష్యాల సాధనపై అవగాహన పెంచుకోవాలి
- ఆసుపత్రుల్లోనే గర్భిణుల ప్రసవాలు జరగాలి
- అధికారులను ఆదేశించిన ప్లానింగ్ సెక్రటరీ విజయ్ కుమార్



సమావేశంలో మాట్లాడుతున్న ప్లానింగ్ సెక్రటరీ విజయకుమార్

కర్నూలు(సెంట్రల్): పేదరికాన్ని తరిమికొట్టడంతో పాటు అన్ని రంగాల్లో పురోగతి సాధించేందుకు కృషి చేయాలని ప్లానింగ్ సెక్రటరీ విజయ్‌కుమార్ అన్నారు. స్టాంటన్‌పురంలోని కర్నూలు కన్వెన్షన్ హాల్‌లో స్పందన, సుస్థిర అభివృద్ధి లక్ష్యాల సాధనపై ఉమ్మడి కర్నూలు జిల్లా అధికారులతో బుధవారం ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా విజయ్ కుమార్ మాట్లాడుతూ సుస్థిర అభివృద్ధి లక్ష్యాలైన 17 అంశాల్లో పురోగతి సాధిస్తే ఉన్నత శిఖరాలను అందుకోవచ్చన్నారు. గర్భిణుల ప్రసవాలు ఆసుపత్రుల్లోనే జరిగేలా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. పదో తరగతి పరీక్షలు రాస్తున్న ప్రతి ఒక్క విద్యార్థిని ట్రాక్ చేసి పోషకాహారం అందించాలన్నారు. స్పందనకు వచ్చిన ప్రతి అర్జీని అధికారులు క్షేత్రస్థాయి పరిస్థితులను తెలుసుకొని పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. నంద్యాల జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్ మాట్లాడుతూ స్పందన అర్జీల పరిష్కారం ప్రతి ఒక్క అధికారి బాధ్యతగా తీసుకోవాలన్నారు. సచివాలయాల్లోని మహిళా పోలీసులు, హెల్త్ వర్కర్స్ ప్రజల మధ్యే అధికంగా ఉంటారని, వారి సమస్యలను తెలుసుకొని పరిష్కారానికి చొరవ చూపాలన్నారు.

కర్నూలు జాయింట్ కలెక్టర్ ఎస్.రామసుందర్‌రెడ్డి మాట్లాడుతూ స్పందన అర్జీలు రీ ఓపెన్ కాకుండా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. ప్రస్తుతం జిల్లాలో స్పందనకు సంబంధించి జిల్లా స్థాయి, డివిజన్ స్థాయి, మండల స్థాయి టీములు ఏర్పాటు చేసుకొని నాణ్యతతో కూడిన పరిష్కారాన్ని అందించాలన్నారు. అనంతరం స్కూల్ ఎడ్యుకేషన్,ఆరోగ్యం, స్త్రీ శిశు సంక్షేమం, నగరపాలక సంస్థ, సర్ఫ్, పంచాయతీరాజ్, పోలీస్, పర్యావరణం తదితర అంశాలపై సంబంధిత రాష్ట్రస్థాయి అధికారులు పూర్తిస్థాయిలో పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా హాజరైన ఉమ్మడి జిల్లాల జిల్లాస్థాయి, మండల స్థాయి అధికారులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో నంద్యాల జాయింట్ కలెక్టర్ టి.నిశాంతి, కర్నూలు నగరపాలక సంస్థ మున్సిపల్ కమిషనర్ భార్గవ్ తేజ, ఆదోని సబ్ కలెక్టర్ అభిషేక్ కుమార్, అడిషనల్ ఎస్పీ డి.ప్రసాద్, ప్లానింగ్ డైరెక్టర్ సుదర్శనం, ఎస్డీజీ స్టేట్ కోఆర్డినేటర్ విజయదుర్గ, ఎంఐయుడి డైరెక్టర్ రవీంద్ర బాబు, సీపీఓ అప్పలకొండ, జిల్లాపరిషత్ సీఈఓ నాసరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



హాజరైన అధికారులు

మాజీ సర్పంచ్ భర్త అనుమానాస్పద మృతి



మృతి చెందిన హేమ్లానాయక్

తుగ్గలి: జొన్నగిరి మాజీ సర్పంచ్ కుంతావత్ లక్ష్మీదేవి భర్త హేమ్లానాయక్(53) అనుమానాస్పదస్థితిలో మృతి చెందాడు. బుధవారం ఉదయం 11గంటల సమయంలో తోటకు వెళ్లొస్తానని చెప్పి ఇంటి నుంచి బయటకు వెళ్లాడు. తోట సమీపంలోని వంకలో ముళ్ల చెట్టు కింద పడి ఉన్న హేమ్లానాయక్ మృతదేహాన్ని సాయంత్రం అటుగా వెళ్లిన గొర్రెలు కాపరులు చూశారు. గ్రామస్తులకు, కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. మృతదేహంపై అక్కడక్కడ బొబ్బలతో చర్మం ఊడింది. మృతుడు ఆత్మహత్యకు ఏమైనా పాల్పడ్డాడా లేక మరేదైనా కారణమా అనేది పోలీసుల విచారణలో తెలియాల్సి ఉంది. జొన్నగిరి ఎస్ఐ రామాంజినేయులు ఘటనా స్థలానికి చేరుకొని మృతిపై ఆరా తీశారు. మృతుడికి భార్య, కుమారుడు, కూతురు ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేస్తామని ఎస్ఐ చెప్పారు.

పిల్లలతో సహా అందరినీ చంపుతామంటున్నారు

- భూమా విఖ్యాత్ రెడ్డితో ప్రాణహాని ఉంది
- రక్షణ కల్పించాలని ఎస్పీకి గిరిజన మహిళ విన్నపం



ఎస్పీకి వినతి పత్రం అందిస్తున్న బాధితులు

బొమ్మలసత్రం: ''అకారణంగా మాపై దాడి చేశారు.. ఇంట్లో పిల్లలతో సహా అందరినీ చంపుతామని బెదిరిస్తున్నారు. టీడీపీ నేత భూమా జగత్ విఖ్యాత్‌రెడ్డిని అరెస్ట్ చేసి, మా ప్రాణాలకు రక్షణ కల్పించండి'' అంటూ ఆళ్లగడ్డ పట్టణానికి చెందిన గిరిజన మహిళ సునీత బుధవారం నంద్యాలలో ఎస్పీ రఘువీర్‌రెడ్డికి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ''రేషన్ బియ్యం విక్రయిస్తున్నాడన్న నెపంతో మా బావ శ్రీనివాసులుపై ఈనెల 7వ తేదీన భూమా జగత్ విఖ్యాత్‌రెడ్డి దాడి చేశాడు. ఆ సందర్భంలో నేను అక్కడే ఉన్నాను. దాడి చేయవద్దంటూ అడ్డుపడ్డాను. భూమా జగత్ విఖ్యాత్ రెడ్డి నన్ను దుర్భాషలాడి, కులంపేరుతో దూషించి దాడి చేశాడు'' అని కన్నీటి పర్యంతమయ్యారు. దాడి అనంతరం కౌన్సిలర్ చక్రపాణికి ఫోన్ చేసి ఇంటి వద్దకు పిలిపించారని తెలిపారు. చక్రపాణి రాగానే ''భూమా కుటుంబంపై పోటీ చేసి కౌన్సిలర్‌గా గెలిచావు...నీకు అంత దమ్ము ఎవరిచ్చారు'' అని ప్రశ్నించి అందరూ కలిసి చక్రపాణిపై దాడి చేశారని చెప్పారు. ఇంట్లో పిల్లలతో సహా అందరిని చంపుతామని బెదిరించారని, ప్రతి రోజూ కొందరు బైక్‌లపై వచ్చి బెదిరించి వెళ్తున్నారని సునీత తెలిపారు. ట్రైబల్ స్టూడెంట్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు రాగిరి చంద్రప్ప మాట్లాడుతూ గిరిజన కుటుంబాలు ఈమధ్య కాలంలో రాజకీయంగా బలపడుతున్నాయని, వారికి ప్రోత్సాహం అందించాల్సి పోయి వారిపై పెత్తనం చెలాయించటం సరైందికాదన్నారు. ఆళ్లగడ్డలో కౌన్సిలర్‌గా ఉన్న చక్రపాణిని ఫోన్‌లో బెదిరించటం, దాడి చేయటం గిరిజనుల అభివృద్ధిని అణగదొక్కడమేనన్నారు. భూమా జగత్ విఖ్యాత్ రెడ్డి తన అనుచరులతో కలిసి దాడి చేయటమే కాకుండా గిరిజన కుటుంబాన్ని అంతం చేస్తానని బెదిరించటం తగదన్నారు. భూమా జగత్ విఖ్యాత్‌రెడ్డితో పాటు ఆయన అనుచరులను అరెస్ట్ చేసి, సునీత, శ్రీనివాసులు కుటుంబానికి రక్షణ కల్పించాలని కోరారు.

లింగోద్భవ కాలంలో మహానందీశుడి దర్శనం

- నేటి నుంచి మహానందిలో స్పర్శ దర్శనం నిలిపివేత
- రుద్రగుండం కోనేరులో తాత్కాలికంగా స్నానాలు రద్దు
- కమిషనర్ ఆదేశాల మేరకు ఉచిత పాసుల జారీ నిలిపివేత



మాట్లాడుతున్న చైర్మన్, ఈఓ

మహానంది: మహాశివరాత్రి సందర్భంగా లింగోద్భవ సమయంలో సాధారణ భక్తులకు సైతం మహానందీశ్వరస్వామి వారి దర్శనం కల్పిస్తామని ట్రస్ట్‌బోర్డు చైర్మన్ కొమ్మా మహేశ్వరరెడ్డి, ఈఓ కాపు చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. మహానందిలో బుధవారం విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ గత ఏడాది లాగే ఈ ఏడాది రూ.వంద ఆర్జిత సేవా టికెట్లతో లింగోద్భవ కాల రుద్రాభిషకం సమయంలో దర్శన సౌకర్యం ఉంటుందన్నారు. ఆర్జిత సేవా టికెట్ల కోసం ఏడు కౌంటర్లు, ప్రసాదాల విక్రయాల కోసం నాలుగు కౌంటర్లు ఏర్పాటు చేశామన్నారు. గతంలో రెండు కి.మీ. దూరంలో వాహనాల పార్కింగ్ ఉండేదని, ఈ ఏడాది దేవస్థానం దగ్గర్లోనే ఏర్పాటు చేసినట్లు చెప్పారు. భక్తుల ఆరోగ్యం కోసం ముగ్గురు వైద్యులు అందుబాటులో ఉంటారని పేర్కొన్నారు. భక్తుల కోసం 1.50 లక్షల లడ్డూ ప్రసాదాలు అందుబాటులో ఉంచుతామన్నారు. అలాగే భక్తుల సహకారంతో మజ్జిగ పంపిణీ చేస్తామన్నారు. దేవదాయశాఖ కమిషనర్ హరిజవహర్‌లాల్ ఆదేశాల మేరకు విజయవాడకు చెందిన దాతలు సుబ్బారావు, వెంకటేశ్వరరావు, లక్ష్మీనారాయణ సహకారంతో భక్తులకు ఉచిత ప్రసాదాల పంపిణీ చేపడతామని, ఈ ఏడాది నూతనంగా తప్పెటగూళ్లు, కేరళ కళాకారులతో సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నామని వివరించారు.

నేటి నుంచి స్పర్శ దర్శనం రద్దు..

మహాశివరాత్రి పురస్కరించుకుని 16 నుంచి 21వ తేదీ వరకు స్పర్శ దర్శనం రద్దు చేస్తున్నట్లు వేదపండితులు రవిశంకర అవధాని తెలిపారు. అలాగే స్వామి,అమ్మవార్లు కల్యాణ దీక్షలో ఉంటారని, నిత్యం పూజాధికాలకు గంగాజలం వినియోగించాల్సి వస్తుందని, ఇందులో భాగంగా రుద్రగుండం కోనేరులో పుణ్యస్నానాలను తాత్కాలికంగా నిలిపేస్తున్నట్లు వెల్లడించారు. సమావేశంలో ఏఈఓ ఎర్రమల మధు, సూపరింటెండెంట్ ఓంకారం వెంకటేశ్వరుడు, ధర్మకర్త బుసకాని వెంకటేశ్వర్లు, గంగిశెట్టి మల్లికార్జున పాల్గొన్నారు.

ఉచితపాసుల జారీ నిలిపివేత..

ఉత్సవాల సందర్భంగా గతంలో జారీ చేసే ఉచిత, వీఐపీ దర్శన పాసులను రద్దు చేస్తున్నట్లు ఈఓ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. దేవదాయ శాఖ కమిషనర్ హరిజవహర్‌లాల్ ఆదేశాల మేరకు ఈ ఏడాది పాసుల జారీని నిలిపేస్తున్నట్లు చెప్పారు.